

ఖమ్మం వీడీవోస్ కాలనీ సాయిబాబా గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గుంటు మల్లన్న ఆలయంలో వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు, ఉసిరి చెట్టు నీడలో బతుకమ్మ వదులుతున్న మహిళ

ఎంగిలి పూల సంబురం

ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు సంబురంగా జరుపుకునే బతుకమ్మ పండుగ బుధవారం మొదలైంది. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మగా జరుపుకున్న మహిళలు ఉదయం నుంచే పూల సేకరణతో పాటు బతుకమ్మలు పేర్చడంలో నిమగ్నమయ్యారు. సాయంత్రానికి సిద్ధమైన బతుకమ్మలతో కాలనీలు, గ్రామాల్లోని ఆలయాలకు చేరుకుని ఆడిపాడారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుని ఇళ్లకు బయలుదేరారు. అయితే, జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం నుంచి గాలిదుమారం, వర్షం రావడంతో నిరాశ ఎదురైంది. ఆతర్వాత వాతావరణం శాంతించడంతో ఆడపడుచులు ఉత్సాహంగా బయలుదేరి బతుకమ్మ జరుపుకోగా... ఒక్కేసి పువ్వేసి చందమామా.. అంటూ సాగిన పాటలతో ఆలయాలు, కాలనీలు మార్మోగాయి. ఇక జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో బంతి, తంగేడు, గునుగు, తామర పూల అమ్మకాలు బుధవారం మధ్యాహ్నం వరకు జోరుగా కొనసాగాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాలలో 47 మందికి ప్రవేశాలు



విద్యార్థికి ప్రవేశపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం ఎంబీబీఎస్ రెండో బ్యాచ్ ప్రవేశాలు మొదలయ్యాయి. కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలన అనంతరం అధికారులు ప్రవేశ పత్రాలు జారీ చేస్తున్నారు. మొదటిరోజు 27 సీట్లు భర్తీ కాగా, రెండోరోజైన బుధవారం 20 మంది చేరారు. రాష్ట్రస్థాయి కోటాలో మొదటి విడతగా 62 సీట్లకు 47 సీట్లు భర్తీ కాగా గురువారం ఇంకొందరు చేరే అవకాశముందని ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు. కాగా, గాంధీ జయంతి సందర్భంగా మెడికల్ కాలేజీలోని విగ్రహానికి ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ సరిత, కళ్యాణి, రమణారెడ్డి, బాలచందర్, పృథ్వీ, ఆనంద్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అక్రమ రవాణాను అడ్డుకుందాం..

ఖమ్మంవన్‌టౌన్: పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలను అడ్డుకోవడంలో అందరూ కలిసి రావాలని జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి సూచించారు. పసిపిల్లల సంరక్షణ కోసం జిల్లా యంత్రాంగం చేపట్టిన 'చిన్నారి' కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఖమ్మం రైల్వేస్టేషన్‌లో చైల్డ్ హెల్ప్ డెస్క్ వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించాక ఆయన మాట్లాడారు. పిల్లల అక్రమరవాణా, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ఆన్‌లైన్ వేధింపులు, మాదక ద్రవ్యాల రవాణా, వాడకంపై సమాచారాన్ని 1098కు తెలియచేయాలని కోరారు. కాగా, 'చిన్నారి' కార్యక్రమంలో భాగంగా పిల్లల్లో శారీరక మార్పులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. బాలల సంరక్షణ కమిటీ చైర్‌పర్సన్ భారతీరాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' స్కూల్ పరీక్షలు

- జిల్లాలో రెండు కేంద్రాల ఏర్పాటు



ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ఈనెల 9వ తేదీ వరకు జరగనున్నాయి. పదో తరగతి, ఇంటర్ అభ్యర్థులకు థియరీ పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2-30నుంచి 5-30గంటల వరకు రెండు విడతల్లో నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలకు 340మంది హాజరుకానుండగా, ఖమ్మంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో, ఇంటర్ విద్యార్థులు 373మంది కోసం రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెంటర్లు ఏర్పాటుచేశారు. రెండు కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించడంతో పాటు విద్యుత్, తాగునీరు, వైద్యసౌకర్యం కల్పిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు లేదా ఇతర ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. కాగా, పరీక్ష సమయానికి గంట ముందు నుంచే చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

ఎట్టకేలకు ప్రారంభం

- డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన
- మెసేజ్ వచ్చినా జాబితాలో పేర్లు లేక పలువురి ఆవేదన
- మేమేం చేయలేమని చేతులెత్తేసిన అధికారులు
- తొలిరోజు హాజరైన 321మంది అభ్యర్థులు



జాబితాలో పేర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గత ఆగస్టులో నిర్వహించిన డీఎస్సీ-2024 ఫలితాలను గత నెల 30వ తేదీన విడుదల చేసిన ప్రభుత్వం ఆ మరుసటి రోజైన మంగళవారమే సర్టిఫికెట్లు పరిశీలించాలని నిర్ణయించింది. అయితే, ఉన్నతాధికారుల నుంచి జాబితా అందకపోవడంతో ఏర్పాట్లు చేసినా ప్రక్రియ మొదలుకాలేదు. మంగళవారం రాత్రి పొద్దుపోయాక 1:3 నిష్పత్తిలో ఎస్‌జీటీ 334 పోస్టులకు గాను 997మంది అభ్యర్థుల జాబితా విడుదల చేయగా బుధవారం జిల్లా కేంద్రంలోని రోటరీనగర్ హైస్కూల్‌లో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. ఈప్రక్రియ 5వ తేదీ వరకు కొనసాగనుంది.

హడావుడి.. అరకొరగా సమాచారం

డీఎస్సీ అభ్యర్థులు సాయంత్రం వరకు మంగళవారం పడిగాపులు కాసి తిరుగుముఖం పట్టారు. ఆ రాత్రి జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చడమే కాక అభ్యర్థుల సెల్‌ఫోన్లకు సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నా చాలా మంది మెసేజ్ రాలేదని వెల్లడించారు. ఇంకొందరికి మెసేజ్ వచ్చినా జాబితాలో పేర్లు లేకపోవడంతో అధికారులు సర్టిఫికెట్ల పరిశీలించబోమని చెప్పగా అసహనం వ్యక్తం చేశారు. అంతేకాక డీఎస్సీ రాసిన పలువురు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తుండడంతో ఇప్పుడు ఉపాధ్యాయ పోస్టు ఎంచుకుంటే సర్వీస్ కలుపుతారా, లేదా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురైందని తెలుస్తోంది. అంతేకాక ఫలితా లు విడుదల చేసిన మరుసటి రోజే సర్టిఫికెట్ల పరిశీల న చేపట్టడంతో చాలా మంది అభ్యర్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కాగా, బుధవారం 321మంది హాజరయ్యారని, ఇందులో 317మంది తెలుగు మీడియం అభ్యర్థులు, నలుగురు ఉర్దూ మీడియం అభ్యర్థులు ఉన్నారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. కాగా, కేంద్రాన్ని మోడల్ స్కూళ్ల డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, సెంటర్‌లో పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి అభ్యర్థులకు అవసరమైన సలహాలు ఇచ్చారు.



అభ్యర్థులతో మాట్లాడుతుతున్న జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, పక్కన డీఈఓ శర్మ

జాబితాలో పేరు లేదు..



ఎస్‌జీటీ విభాగంలో 51.03మార్కులతో 1,024వ ర్యాంక్ వచ్చింది. ఎస్టీ కేటగిరీతో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని మెసేజ్ వచ్చింది. దీంతో ఇక్కడకు వస్తే జాబితాలో పేరు లేనందున అనుమతించమని చెప్పారు. ఫలితంగా ఆశతో వచ్చిన నాకు నిరాశే మిగిలింది.

– గుగులోతు సరిత, రాములుతండా, రఘునాథపాలెం, మండలం

హైదరాబాద్ వెళ్లమన్నారు..



సెల్ మెసేజ్ రావడంతో వెరిఫికేషన్ కేంద్రానికి వస్తే జాబితాలో పేరు లేదని అధికారులు చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే హైదరాబాద్‌లో ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. ఇప్పటికప్పుడు ఇది ఎలా సాధ్యమవుతుందో అధికారులే చెప్పాలి.

– టి.సుజాత, ఖమ్మం

ఆనందంగా వస్తే...



1:3 జాబితాలో పేరు ఉందని మెసేజ్ రావడంతో ఆనందపడ్డాను. ఈనెల 2నుంచి 5వ తేదీ వరకు సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవచ్చని అందులో ఉంది. తీరా ఇక్కడకు వస్తే నోటీస్ బోర్డులో పేరు లేదు. ఉద్యోగం తప్పక వస్తుందనే ఆశతో వచ్చినా నిరాశగా వెళ్తున్నాను.

– కె.రవీంద్రబాబు, ఖమ్మం

సత్ప్రవర్తనతో మెరుగైన జీవనం

- జిల్లా జడ్జి రాజగోపాల్



పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మంరూరల్/ఖమ్మం లీగల్: ఖైదీలు శిక్షాకాలంలో సత్ప్రవర్తన అలవర్చుకుంటే బయటకు వచ్చాక మెరుగైన జీవనం సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం రామన్నపేటలోని జిల్లా జైలును బుధవారం సందర్శించిన ఆయన గాంధీ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆతర్వాత ఖైదీల సంక్షేమ దినోత్సవంలో జడ్జి రాజగోపాల్ తెలిసోతెలియక నేరం చేసి శిక్ష అనుభవిస్తున్న వారు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ జైలులో ఖైదీల ఉపాధి, సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆతర్వాత ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖర్‌రావు, జైలు అధికారులు జి.వెంకటేశ్వర్లు, సక్రూనాయక్, లక్ష్మీనారాయణ, సుభాష్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లోనూ జిల్లా జడ్జి రాజగోపాల్ పాల్గొని మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శ్రీనివాస్, చింతనిప్పు వెంకట్‌తో పాటు కొల్లి సత్యనారాయణ, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఐతం రవీంద్ర, తన్నీరు లలిత, శ్రీలక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఇక ఖమ్మంలోని జీవన సంధ్య వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు పండ్లు పంపిణీ చేసి న్యాయ సాయంపై అవగాహన కల్పించారు. వృద్ధాశ్రమం పర్యవేక్షకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలకు వస్తేనే సమస్యల పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

రఘునాథపాలెం: గ్రామసభలకు హాజరై సమస్యలను వివరిస్తేనే పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. రఘునాథపాలెంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామస్వరాజ్యం కోసం గాంధీజీ కన్న కలలు నెరవేరాలంటే అందరూ సహకరించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులే కాక ప్రజలు కూడా హాజరై సమస్యలను వెల్లడించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, సీఐ ఉస్మాన్‌షరీఫ్ పాల్గొనగా తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడంతో పాటు కార్మికులను సన్మానించాక పల్లెదవాఖానాలో మొక్కలు నాటారు. అలాగే, మండలంలోని వీవీపాలెం గ్రామసభలో డీఎల్‌పీఓ రాంబాబు మాట్లాడారు. గ్రామ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో కార్మికులకు ప్రమాద బీమా పత్రాలు అందజేసి ఉపాధి హామీ పనులపై చర్చించారు.

15 వరకు కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

ఖమ్మం సహకానగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(గతంలో ఎస్డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల దరఖాస్తు గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారు. ఈ విషయాన్ని ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి ఒక ప్రకటనలో వెల్లండించారు. అర్హతలు, ఫీజు వివరాల కోసం 98492 50633, 80088 11998 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'ఏకలవ్య'తో బంగారు భవిష్యత్

- ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్
- రేలకాయలపల్లి పాఠశాలను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్, వైరా ఎమ్మెల్యే రాములునాయక్



వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోదీ

కారేపల్లి: సీబీఎస్‌ఈ సిలబస్ బోధించే ఏకలవ్య మోడల్ పాఠశాలతో గిరిజన విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. కారేపల్లి మండలం రేలకాయలపల్లిలో రూ.35కోట్ల నిధులతో నిర్మించిన ఏకలవ్య మోడల్ పాఠశాలను ప్రధాన మంత్రి మోదీ బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 40 ఏకలవ్య పాఠశాలలను ఏకకాలంలో ఆయన ప్రారంభించగా పాఠశాలలో భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6నుండి 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ విధానంలో బోధన ఉంటుందని తెలిపారు. కాగా, పాఠశాల భవన నిర్మాణానికి వ్యవసాయ భూములు ఇచ్చిన రైతులు అభినందనీయులని కొనియాడారు. అనంతరం ఐటీడీఏ పీఓ రాహుల్ మాట్లాడుతూ 480 మంది గిరిజన విద్యార్థులకు బోధనతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో శిక్షణ అందుతుందని తెలిపారు. దసరా సెలవు అనంతరం నూతన భవనంలో తరగతులు మొదలవుతాయని చెప్పారు. కాగా, కారేపల్లి మండల జనాభా దృష్ట్యా చీమలపాడు ప్రాంతంలో నూతనంగా పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అనంతరం పాఠశాల భవన నిర్మాణాలకు భూములు ఇచ్చిన 10 మంది రైతులతో పాటు రేలకాయలపల్లి, చీమలపాడు మాజీ సర్పంచ్‌లు భూక్యా రమణ, మాలోత్ కిషోర్‌ను సన్మానించారు.

భూనిర్వాసిత రైతుల ఆందోళన

పాఠశాల నిర్మాణానికి భూములు ఇచ్చే సమయాన పరిహారం చెల్లించడమేకాక పాఠశాలలో ఉపాధి కల్పిస్తామని చెప్పి విస్మరించారని పలువురు భూనిర్వాసితులు ఆందోళనకు దిగారు. దీంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారాం నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోగా కొందరు పురుగు మందుల డబ్బాలతో రావడంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పడంతో వారు శాంతించారు. తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ రమేష్, మాజీ ఎంపీపీ మాలోత్ శంకుతల, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం





వైరా రూరల్ : గొల్లపూడి-పాలడుగు మధ్య రహదారిపై కూలిన భారీ వృక్షం

(ఇన్‌సెట్) కూసుమంచి : మండల కేంద్రంలో ఓ ఇంటి పైరేకులు ఎగిరిపడిన దృశ్యం

- పలుచోట్ల ఎగిరిపడిన ఇళ్ల పైకప్పులు
- రహదారులపై కూలిన భారీ వృక్షాలు
- రాకపోకలకు అంతరాయం.. నిలిచిన విద్యుత్ సరఫరా

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలంగా వీచిన ఈదురుగాలులతో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోగా, భారీవృక్షాలు నేలకూలాయి. ఖమ్మం నగరంతో పాటు, కూసుమంచి, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, పెనుబల్లి, వైరా, కొణిజర్ల, ముదిగొండ తదితర మండలాల్లో ఈ ప్రభావం కనిపించింది. అలాగే, ఈదురుగాలుల కారణంగా తీగలు తెగి పడడంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రఘునాథపాలెంలో 51.5 మి.మీ. వర్షపాతం



నేలకొండపల్లి : భైరవునిపల్లిలో గేదెపై పడిన చెట్టు



పెనుబల్లి : గాలిదుమారానికి నేల కొరిగిన భారీ వృక్షం

రఘునాథపాలెం మండల కేంద్రంలో వర్షం బీభత్సం సృష్టించింది. ఇక్కడ గరిష్ఠంగా 51.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, ముదిగొండలో 37.3, పెనుబల్లిలో 36.5, ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 36.3, ఖమ్మం ఖానాపురంలో 34, తిరుమలాయపాలెంలో 33, పమ్మిలో 24, రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలో 23.5, తల్లాడలో 23, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 20 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. నాలుగురోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా బుధవారం అత్యధికంగా 41.7 సెల్సియస్ డిగ్రీలుగా నమోదైంది. ఈక్రమాన సాయంత్రం వర్షం కురవడంతో భానుడు శాంతించే అవకాశముంది. ఇక ఈ వర్షం వరి, మిరప, ఉద్యాన పంటలకు ప్రయోజకరంగా ఉన్నా.. పత్తి నాణ్యతను దెబ్బతీస్తుందని రైతులు చెబుతున్నారు.

- ఖమ్మంమయూరిసెంటర్/వైరా రూరల్/నేలకొండపల్లి/పెనుబల్లి: ఈదురు గాలులు, వర్షంతో ఖమ్మం 25వ డివిజన్‌లో ఉన్న పురాతన భారీ మర్రిచెట్టు నేలకొరిగింది. పక్కనే ఉన్న పురాతన బావి, ఇతర గోడలపై పడడంతో సమీప ప్రాంతాన ఉన్న ఇళ్లలోని వారు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో కేఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది చేరుకుని చెట్టుకొమ్మలను తొలగించడంలో నిమగ్నమయ్యారు. అలాగే, వైరా మండలం గొల్లపూడి-పాలడుగు మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఉన్న భారీ వృక్షం వైరా-జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై కూలింది. దీంతో ట్రాఫిక్ స్తంభించగా పోలీసులు చేరుకుని గన్నవరం వైపు నుండి పంపించి ట్రాఫిక్ మళ్లించారు. ఇక నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో పెద్దపాక రవికి చెందిన పాడి గేదెపై చెట్టు కూలడంతో గాయపడింది. అలాగే, పలువురు ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. అనాసాగారం శివార్లలో చెట్టు కూలి రోడ్డుపై అడ్డంగా పడగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెనుబల్లి మండలం కేంద్రంలో పలు కూడా పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. వీఎం బంజర్ రింగ్ సెంటర్ వద్ద రహదారిపై 3నుంచి 4 అడుగుల మేర వరద ప్రవహించింది. పలుప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఉద్యోగులు మరమ్మతులు చేపట్టారు.

క్లుప్తంగా

మాజీ ఎంపీ నివాళి


తల్లిదండ్రుల విగ్రహాల వద్ద మాజీ ఎంపీ నామా, తదితరులు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం గొల్ల గూడెంలోని స్మృతివనంలో బుధవారం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తల్లిదండ్రులైన ముత్తయ్య - వరలక్ష్మి నాలుగో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నామా తన తల్లిదండ్రుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నామ రామారావు, నామ సీతయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. మంత్రి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మృతి చెందగా హైదరాబాద్‌లోని వారి నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులతో మాట్లాడారు. మాజీ ఎంపీ వెంట పలువురు నాయకులు ఉన్నారు.

నేడు ధృవపత్రాల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: డీఎస్సీ 2008లో ఎంపికైన అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించాలని నిర్ణయించగా, ఇటీవల సర్టిఫికెట్లు పరిశీలించారు. అయితే, రెండో రోజుల పాటు హాజరుకాలేకపోయిన అభ్యర్థులకు మరో అవకాశం ఇచ్చారు. ఈమేరకు ఏజెన్సీ ప్రాంత అభ్యర్థుల సర్టిఫికెట్లను గురువారం ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని గిరిజన భవనంలో పరిశీలించనున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 9.30 గంటల్లోగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్‌తో హాజరు కావాలని సూచించారు.

కామర్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్


గుడిపల్లి సునీత

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్ రోడ్డులో ఉన్న గురుకుల డిగ్రీ మహిళా కళాశాల కామర్స్ అధ్యాపకురాలు గుడిపల్లి సునీతకు డాక్టరేట్ లభించింది. 'ఇన్నోవేషన్ ఇన్ బ్యాకింగ్ సెక్టార్ – ఏ స్టడీ ఫ్ సెలెక్ట్ బ్యాంక్స్' అంశంపై ఆమె సమర్పించిన పరిశోధనాగ్రంథానికి చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా సునీతను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

చంద్రుగొండ వాసికి...

చంద్రుగొండ: చంద్రుగొండకు చెందిన మహమ్మద్ జహీర్ అహ్మద్‌కు డాక్టరేట్ లభించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇమాంసాహెబ్ కుమారుడైన జహీర్‌ను పలువురు అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీ


పీఏసీఎస్‌లో రిజిస్టర్లు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం, తిరుమలాయపాలెంలో ఎరువుల దుకాణాల జిల్లా వ్యవసాయాధికారి పి.పుల్లయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, రైతులకు ఇచ్చిన బిల్లులను పరిశీలించారు. పీఓఎస్ యంత్రాల ద్వారా అమ్మకాలు చేపట్టాలని సూచించారు. కాగా, రైతులు షాపులకు వచ్చే సమయాన ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం పీఏసీఎస్‌లో కూడా రికార్డులను డీఏఓ పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

బతుకు బండి ఆగింది...



బోసిపోయి కనిపిస్తున్న ఖమ్మం రైల్వేస్టేషన్ ఆవరణ

- రైళ్ల రద్దుతో ఉపాధి కోల్పోయిన చిరువ్యాపారులు
- ఖమ్మం స్టేషన్ చుట్టూ షాపుల్లో మందగించిన వ్యాపారాలు
- ఆటో వాలాలదీ అదే పరిస్థితి..

ఖమ్మం రాపర్తినగర్: రైల్వే లైన్ల విస్తరణ పనుల కారణంగా విజయవాడ – సికింద్రాబాద్ మార్గంలో పలు రైళ్లను అధికారులు రద్దుచేశారు. ఇంకొన్నింటిని దారి మళ్లించారు. దీంతో దసరా సెలవు వేళ స్వస్థలాలకు వెళ్లాలని సిద్ధమైన ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇదే సమయాన స్టేషన్, పరిసరాల్లో చిరువ్యాపారాలతో పొట్ట పోసుకుంటున్న వ్యాపారులు ఉపాధి కోల్పోయి ఆవేదన చెందుతున్నారు.

రైలు నడిస్తేనే జీవనం

ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపాన పెద్దసంఖ్యలో చిరువ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. పాన్‌షాపులు, టీ షాపులు, టిఫిన్ సెంటర్ల వారే కాక కాక స్టేషన్‌లో తినుబండారాలు అమ్మే బడుగు జీవులు ఈ జాబితాలో ఉంటారు. కానీ పలు రైళ్ల రద్దు కావడంతో పదిహేను రోజులుగా వీరంతా ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఆటో వాలాలు సైతం రోజుకు రూ.600 మేర సంపాదించగా ఇప్పుడు రూ.150నుంచి రూ.200 దాటడం లేదని వాపోతున్నారు. రద్దయిన రైళ్లలో చాలా వరకు ఈనెల 7, 8వ తేదీ తర్వాతే పునః ప్రారంభం కానున్నాయి. దీంతో అప్పటివరకు తాము ఉపాధి కోల్పోయినట్లేనని వారంతా చెబుతున్నారు.

అమ్మకాలు అంతంతే...



సరుకులు కొనే వారు లేక పది రోజులుగా ఖాళీగా కూర్చుంటున్నాం. దీంతో నా కుటుంబానికే కాక షాపుపై ఆధారపడిన పడిన వారికీ సమస్యే. తరచుగా పనుల కారణంగా రైళ్లు రద్దు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ మార్గంలో రైళ్లు నడిచి ప్రయాణికులు వస్తేనే మళ్లీ పరిస్థితులు చక్కబడతాయి.

– ఎం.డీ.బాజీ, కిరాణం షాపు

రోజుకు 200 బిర్యానీలు అమ్మేవాళ్లం..



స్టేషన్ సమీపాన మా హోటల్ ఉండడంతో 200పైగా బిర్యానీలు అమ్ముడయ్యేవి. కానీ రైళ్లు రద్దయ్యాక 50 బిర్యానీలు కూడా అమ్ముడుపోవడం లేదు. ఇటీవల కాలంలో నెల, రెండు నెలలకోసారి రైళ్లు రద్దవుతుండడంతో ఇబ్బంది పడుతున్నాం. రైళ్లు పూర్తిస్థాయిలో నడిస్తేనే వ్యాపారం గాడిన పడుతుంది.

– ఎస్.కే.సలీం, బిర్యానీ పాయింట్

ఆటోలు నడవడం లేదు



రోజుకు రూ.700 వరకు సంపాదించే వాడిని. కానీ ఇప్పుడు రూ.200 కూడా దాటడం లేదు. గత పది రోజులకు పైగా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. రోజు రాకపోతే అడ్డాలో పేరు తీసేస్తారనే భయంతో తప్పనిసరి వస్తున్నా. లైన్ ఎప్పుడు పూర్తవుతుందో.. రైళ్లన్నీ ఎప్పుడు నడుస్తాయో తెలియడం లేదు.

– కమల్‌పాషా, డ్రైవర్

దయనీయంగా పరిస్థితి...



రైళ్లలో చిప్స్, వాటర్ బాటిళ్లు అమ్ముతాను. ఇప్పుడు రైళ్లు నడవకపోవడంతో నాలాంటి వాళ్లం ఇబ్బంది పడుతున్నాం. రైళ్లు నడిస్తేనే మా బతుకులు సాగేది. వీలైనంత త్వరగా రైళ్లు మొదలైతేనే మాకు మేలు జరుగుతుంది. విజయవాడ–హైదరాబాద్, బల్లార్ష మధ్య నడిచే రైళ్లు రద్దు కావడంతోనే ఈ పరిస్థితి.

– ఏ.ప్రసాద్, హాకర్

చదువుల తల్లిని కనికరించని లక్ష్మీదేవి

- ప్రభుత్వ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని
- చిన్నతనంలోనే తల్లి మృతి.. ఆదరించని తండ్రి
- కూలీ పనులకు వెళ్తూ పెంచి పెద్దచేసిన తాతాఅమ్మమ్మ
- ఫీజు, ఇతర ఖర్చులకు నగదు లేక దాతల కోసం ఎదురుచూపులు


తాత, అమ్మమ్మ జోజి - ప్రకాశమ్మతో శ్రీహర్షిత

వైరా: 'నాకు డాక్టర్ కావాలని ఉంది ఉంది తాతా.. కానీ అది చదవాలంటే ఎంతో ఖర్చు.. నువ్వు భరించగలవా' అని ఆ విద్యార్థిని ఐదేళ్ల ప్రశ్నించింది. దీంతో 'నీ బాధ్యత నాకెప్పుడూ భారం కాదు' అని ఆమె తాత భరోసా కల్పించాడు. అన్నట్లుగానే ఆమె తన కలను నెరవేర్చుకుంది. కానీ ఇప్పటికే శక్తికి మించి శ్రమించిన ఆ విద్యార్థి తాత ఇప్పుడు మెడికల్ కాలేజీ, హాస్టల్‌లో ఫీజు, పుస్తకాలు, ఇతర ఖర్చులు చెల్లించే స్తోమత లేక మనవరాలి పరిస్థితి చూస్తూ కన్నీరు పెడుతున్నాడు. దాతలు చేయూతనిస్తే తప్ప ఆ నిరుపేద విద్యార్థిని ఎంబీబీఎస్ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

ఇదీ కుటుంబ నేపథ్యం

వైరా మున్సిపాలిటీ పరిధి 15వ వార్డు దిద్దుపూడికి చెందిన కొనకంచి జోజి – ప్రకాశమ్మ దంపతుల మనవరాలు పానెం శ్రీహర్షిత చిన్నతనంలోనే తల్లి సీతమ్మను కోల్పోయింది. ఆతర్వాత తండ్రి ఆదరణ దక్కకపోగా శ్రీహర్షితతో పాటు ఆమె చెల్లెలిని వదిలేసి దూరంగా ఉంటున్నాడు. దీంతో ఆడపిల్లలిద్దరిని తాత – అమ్మమ్మ జోజి దంపతులు కూలీ పనులకు వెళ్తూ అన్నీ తామై పెంచి పెద్దచేశారు. శ్రీహర్షిత 7నుండి 10వ తరగతి వరకు బోనకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి పదో తరగతి 10జీపీఏ సాధించింది. ఇంటర్ బైపీసీ ఖమ్మంలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలో పూర్తిచేసిన ఆమె 966 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు రాలేదు. మళ్లీ కళాశాల లెక్చరర్ల ప్రోత్సాహంతో హైదరాబాద్ గొలిదొడ్డిలోని కళాశాలలో లాంగ్ టర్మ్ శిక్షణ తీసుకోగా ఈసారి నీట్‌లో జాతీయస్థాయి 2లక్షలు, రాష్ట్రస్థాయిలో 4,530వ ర్యాంకు సాధించడంతో వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు దక్కింది.

చేతిలో చిల్లిగవ్వ లేక...

కూలీ పనులకు వెళ్తేనే జీవనం సాగే జోజీ దంపతులు తమ మనవరాలు శ్రీహర్షితకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చిందని సంబురపడ్డారు. కానీ కాలేజీ, హాస్టల్ ఫీజులు, పుస్తకాలు ఇతర ఖర్చులకు డబ్బు ఎలా సమకూర్చాలో తెలియక తల్లడిల్లిపోతున్నారు. ఈ మేరకు మంగళవారం లయన్స్‌క్లబ్ బాధ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మరో రూ.50 వేలు అందితే తప్ప చదువు ముందుకు సాగే మార్గం లేక శ్రీహర్షిత సాయం కోసం ఎదురుచూస్తోంది. నాలుగేళ్ల పాటు వైద్యవిద్య చదివితే దాతలు సహకరిస్తే ఆమె లక్ష్యం నెరవేరనుంది. ఈమేరకు దాతలు ముందుకొచ్చి తనను ఆదుకోవాలని శ్రీహర్షితో పాటు ఆమె తాత – అమ్మమ్మ కోరుతున్నారు.

సాయం చేయాలనుకునే వారు...

బ్యాంకు ఖాతా నంబర్ : 40648947479
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : SBIN0013328
(వైరా ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్)

మహాత్మాగాంధీకి ఘన నివాళి


గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో నాయకులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంక్రైం/ఖమ్మం వన్‌టౌన్: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో ఆయన ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గాంధీ విగ్రహానికి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నివాళులర్పించి మాట్లాడారు. సత్యం, అహింసా మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన గాంధీ సేవలు మరువలేనివని తెలిపారు. అలాగే, కలెక్టరేట్‌లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్, డీఆర్వో రాజేశ్వరి, ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పోలీసు కమిషనరేట్‌లో గాంధీ చిత్రపటానికి సీపీ సునీల్‌దత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ అక్తరున్నీసాబేగం, ఆర్ఐ కామరాజు, సెక్షన్ సూపరింటెండెంట్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఇక కాంగ్రెస్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నేతృత్వాన నివాళులర్పించారు.అలాగే, మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం, ఖమ్మంలోని గాంధీ విగ్రహం వద్ద కూడా నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, వడ్డెబోయిన నర్సింహారావు, నాగండ్ల దీపక్‌చౌదరి, పుచ్చకాయల వీరభద్రం, ఎర్రం బాలగంగాధర తిలక్, ముజాహిద్ హుస్సేన్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, రాపర్తి శరత్, పల్లెబోయిన భారతీచంద్రం తదితరులు పాల్గొన్నారు.


గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పించిన సీపీ సునీల్‌దత్, ఉద్యోగులు

చికెన్ అమ్మకందారులకు జరిమానా


చికెన్‌ను స్వాధీనం చేసుకుంటున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలపై నిషేధం విధించారు. ఈ విషయమై ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ముందుగానే ప్రకటన చేశారు. అయినప్పటికీ జిల్లా కేంద్రంలో పలువురు వ్యాపారులు షాపులు తెరిచి మాంసం విక్రయాలు చేపట్టారు. ఈవిషయమై ఫిర్యాదులు అందడంతో మధ్యాహ్నం తర్వాత కేఎంసీ సిబ్బంది వెళ్లి చికెన్ షాపులను తనిఖీ చేసి చికెన్ స్వాధీనం చేసుకోవడంతో పాటు యాజమానులకు జరిమానా విధించారు. కాగా, పలు ప్రాంతాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు కూడా జోరుగా సాగాయని తెలిసింది.

అదుపుతప్పిన ట్రావెల్స్ బస్సు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలంలో బుధవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పింది. ఈఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఖమ్మం నుండి హైదరాబాద్‌కు 24 మందితో వెళ్తున్న బస్సు మండలంలోని హట్యాతండా సమీపాన ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి డివైడర్ల పైనుంచి సర్వీస్ రోడ్డు మీదకు దూసుకెళ్లింది. వెంటనే హైవే భద్రతా సిబ్బంది చేరుకుని బస్సును పక్కకు తప్పించి ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

మట్టి తవ్వకాలు నిలిపివేయాలని తీర్మానం

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణం కోసం ఇన్నాళ్లు చేపట్టిన మట్టి తవ్వకాలు నిలిపివేయాలని మండలంలోని చెరువుమాధారం గ్రామస్తులు తీర్మానించారు. గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి పనుల కోసం ఇన్నాళ్లు గుట్ట మట్టి తరలింపునకు సహకరించామని పలువురు తెలిపారు. భవిష్యత్‌లో స్థానిక అవసరాల కోసం మట్టిని కాపాడుకునేలా ఇకపై మటిట తవ్వకాలు, తరలింపు నిలిపివేయాలని తీర్మానించి జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధికి సమాచారం ఇచ్చారు. దీంతో సంస్థ ప్రతినిధులు మట్టి తరలింపును తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఈవూరి శ్రీనివాసరెడ్డి, ఆకుల వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, యడవల్లి శ్రీను, సూరేపల్లి రవి, ఆకుల సుధాకర్, గెల్లా హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదస్థలిని పరిశీలించిన అదనపు డీసీపీ


వాహనదారులకు సూచనలు చేస్తున్న అదనపు డీసీపీ ప్రసాదరావు

కారేపల్లి: మండలంలోని భాగ్యనగర్ తండా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఒకరికి తీవ్రగాయాలైన విషయం విదితమే. ఈ మేరకు ఘటనాస్థలాన్ని బుధవారం అదనపు డీసీపీ ప్రసాదరావు పరిశీలించారు. ప్రమాదనివారణ చర్యలపై ఉద్యోగులకు సూచనలు చేసిన ఆయన వాహనదారులను కౌన్సెలింగ్ ఇచ్చారు. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడుకు చెందిన ఎలక్ట్రీషియన్ కురుకుంట్ల గోపి(45) బుధవారం మధ్యాహ్నం ఖమ్మం వచ్చాడు. ముస్తఫానగర్ వద్ద ఆయన బైక్‌ను ఎదురుగా వచ్చిన వాహనదారుడు ఢీకొట్టడంతో గోపికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు.

బాణాసంచా స్వాధీనం

మధిర: మధిరలోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ చేసి న బాణాసంచాను పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. పక్కా సమాచారంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు భారీ మొత్తంలో బాణసంచా స్వాధీనం చేసుకున్నారు.

గొలుసు చోరీకి యత్నం

మధిర: పట్టణంలోని బుధవారం రాత్రి 8గంటల సమయాన మహిళా ఉద్యోగి వాకింగ్ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి ఆమె మెడలో గొలుసు చోరీకి యత్నించాడు. అయితే, అప్రమత్తమైన ఆమె కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చిన దుండగుడి విషయమై మధిర టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నారు.

పెట్రోల్ బంక్ ముందు ఆందోళన

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రంక్‌రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద వాహనదారులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. పెట్రోల్‌లో కల్తీ చేస్తున్నారని ఈ సందర్భంగా ఆరోపించారు. గతంలో ఈ బంక్‌లో ఇలాగే జరిగిందని చెబుతూ ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంకొకరి మృతదేహం లభ్యం

సాగర్ కాల్వలో రెండు రోజుల కిందట గల్లంతైన ముగ్గురు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెం వద్ద సాగర్ కాల్వలో సోమవారం గల్లంతైన ముగ్గురిలో ఇంకో వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలానికి చెందిన చల్లా రమేశ్, బండారు భరత్‌కుమార్, వెంకన్న, కట్టా ప్రసాద్ ఖమ్మంలోని దానవాయిగూడెం వద్ద జిల్లా జైలులో ఉన్న మిత్రుడిని చూసేందుకు వచ్చారు. తిరిగి వెళ్లే సమయాన వెంకన్న ఆటోలోనే ఉండిపోగా మిగతా ముగ్గురు సాగర్ కాల్వ వద్ద ఈతకు దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఇందులో భరత్‌కుమార్ మృతదేహం మంగళవారమే లభించగా చల్లా రమేశ్ (45) మృతదేహాన్ని రఘునాథపాలెం మండలం వీవీ పాలెం లాక్‌ల వద్ద బుధవారం గుర్తించారు. ఈ మేరకు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా, ప్రసాద్ మృతదేహం కోసం గాలిస్తున్నామని సీఐ భానుప్రకాశ్ తెలిపారు. అయితే, రాత్రి వరకు ఫలితం లేకపోవడంతో గురువారం గాలించాలని నిర్ణయించారు.

ఒకరిని కాపాడేందుకు వెళ్లి..

ఖమ్మం జిల్లా జైలులో ఉన్న మిత్రుడిని చూసేందుకు నలుగురు మణుగూరు నుంచి ఆటోలో సోమవారం వచ్చారు. తిరిగి వెళ్లే సమయాన ఓ బంధువు ఇంట్లో ఆగిన నలుగురు మార్గమధ్యలో సాగర్ కాల్వ వద్ద ఆగారు. అయితే, వెంకన్న ఆటోలో ఉంటానని చెప్పగా మిగతా ముగ్గురు సరదాగా కాల్వలోకి దిగారు. ఈ క్రమాన భరత్‌కుమార్‌కు ఈత రాకపోవడంతో ఆయన మునిగిపోతుండగా కాపాడే ప్రయత్నంలో చల్లా రమేశ్, కట్టా ప్రసాద్ గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం వెంకన్న చెప్పే వరకూ ఎవరూ గుర్తించలేకపోయారు. కాగా, ఇద్దరి మృతదేహాలు లభించగా కట్టా ప్రసాద్ ఆచూకీ కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు.

డెంగీతో సర్వేయర్ మృతి


బాబురావు (ఫైల్)

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ కటికి బాబురావు డెంగీ బారిన పడగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. గత నెల 16వ తేదీన ఆయనకు డెంగీ నిర్ధారణ కాగా ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ 15రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...

నేలకొండపల్లి: సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఇది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని అమీనాబాద్‌కు చెందిన గుండు లక్ష్మణ్‌రావు(32) నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి–కొత్తూరు శివారు బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించారు. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే ఆయన బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు తెలిసింది. అయితే, బైక్‌పై నుంచి కింద పడి మృతి చెంది ఉంటాడనే భావనతో స్థానికులు సమాచారం ఇవ్వగా, పరిశీలించిన కుటుంబీకులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈమేరకు సమగ్ర విచారణ జరిపించాలని లక్ష్మణ్‌రావు తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

విహార యాత్రలో విషాదం

మనాలీలో ప్రాణం విడిచిన వైరా వాసి లాల్‌కుమార్


లాల్‌కుమార్ (ఫైల్)

షాద్‌నగర్: మిత్రులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన వైద్యుడు ట్రెక్కింగ్ చేస్తూ గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన బుధవారం ఉదయం హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన డాక్టర్ లాల్‌కుమార్(52) కొన్నేళ్లక్రితం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. భార్యాపిల్లలతో పట్టణంలోని సీఎస్‌కే విల్లాలో నివాసం ఉంటున్నారు. అంతకు ముందు పరిగిలో మాగ్నా ఆస్పత్రిని ఏర్పాటు చేసిన ఆయన అనస్తీషియన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్‌గా కొనసాగారు. ఇదిలా ఉండగా తనతో పాటు మెడిసిన్ చదివిన మిత్రులతో కలిసి గత నెల 28న హిమాచల్‌ప్రదేశ్ వెళ్లారు. యాత్రలో భాగంగా బుధవారం ఉదయం మనాలీ చేరుకున్నారు. కొండ ప్రాంతాలపై ట్రెక్కింగ్ చేస్తూ గుండెపోటుకు గురైన లాల్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గురువారం మనాలీ నుంచి షాద్‌నగర్ తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మా అమ్మకు ఉద్యోగం వచ్చిందోచ్!


చిన్నారి తాత ఫ్యాన్ పట్టుకోగా గోరుముద్దలు తినిపిస్తున్న అమ్మమ్మ


అమ్మమ్మ ఒడిలో సేదదీరుతున్న చిన్నారి


అమ్మ దరఖాస్తు రాస్తుండగా చూస్తున్న బాలుడు

డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఖమ్మం రోటరీ నగర్ హైస్కూల్‌లో బుధవారం నుంచి పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళా అభ్యర్థులు పలువురు తమ పిల్లలతో సెంటర్‌కు వచ్చారు. చిన్నారులను వారి బంధువులు లాలిస్తుండగా అభ్యర్థులు సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

సాక్షి క్లాసిఫైడ్స్



FLAT FOR SALE

■ ఖమ్మం మమత హాస్పటల్ వద్ద విలాసవంతమైన 3 బెడ్‌రూమ్స్ తూర్పు ఫేసింగ్ ఫ్లాట్స్ అన్ని వసతులతో అమ్మబడును. బుకింగ్స్ జరుగుచున్నవి. 9010481234. [M-1185299]



■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 9030612463 [M-1185464]

■ ఖమ్మంలోని వెలాసిటి Network యందు సేల్స్ మార్కెటింగ్, టెక్నికల్స్ హెల్పర్స్, ప్లంబర్స్, టెలీకాలర్స్ వెంటనే కావలెను. 8886661780, 9908022621. [M-1185293]

■ ఒమేగా హోమ్‌కేర్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావాలి. ఫ్రీ ఫుడ్ వసతి. జీ: 18K. ఫోన్: 8977639662 [SCA-24000291]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957
	9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792